# దారి



మా ఆఫీసుకు రెండు దారులున్నాయి. ఒకటి దగ్గర దారి. మరోటి కొద్దిగా దూరపుది. దూరపు దారిలో వెడితే కిళ్ళీ కొట్లల్లో తగిలించి ఉన్న పత్రికల తాలూకు బూతు బొమ్మలూ, ఆఫీసుకెళ్ళే ఆంగ్లో ఇండియన్ల పల్చటి గౌనుల్లోంచి కనిపించే సోయగాలూ, నీటుగా ముస్తాబయి కాలేజికి వెళ్ళే పదహారణాల తెలుగు అమ్మాయిల అందం, మనిషికి లేనిపోని ఆశలు కల్పించే లాటరీ టిక్కెట్ల షాపు, కొత్త సినిమాల తాలూకు పోస్టర్లు, నాల్గు రూపాయిలు పెట్టుబడి కూడా లేని వ్యాపారంలో ఏదో లాభం వస్తుందని, దానితో బతకాలని ఆశించే ఉసిరి కాయటు అమ్ముకునే పండు ముసలిదైన మామ్మ, ఘోరమైన రోగాల్ని ఆస్తిగా మిగుల్చుకుంటూ, మగాళ్ళ బలహీనతని డబ్బుగా మార్చుకుంటూ, అందంగా కనిపించడానికి పడే తాపత్రయంలో రోజుకొకలా అలంకరించుకుని, బేరాల కోసం రవీంద్ర లాడ్జి సెంటరులో ఎదురుచూసే మరి కొన్ని ఆడ శరీరాల్ని, ఇంకా, ఇంకా ఇలాంటి వెన్నో చూడవచ్చు.




కానీ నాకా దారమ్మట ఆఫీసుకు వెళ్ళడం ఇష్టం వుండదు. మనిషి కుండే సహజమైన బలహీనతలకి అతీతుడిని కాక పోయినా, అలాంటి వాటిలో నాకెందుకో ఆసక్తి లేదు. అందుకే మా రూమ్మేటు, కొలీగ్ అయిన శాస్త్రితో కల్సి ఆ దారిలో నేను వెళ్ళను. రెండు మూడుసార్లు అతను నాకోసం ఎదురుచూస్తుంటే "వెనకాలే

"వస్తాలే శాస్త్రీ! నువ్వెళ్ళు" అన్నాను. తర్వాత నుంచి అతను ఒంటరిగానే వెళ్ళిపోయేవాడు నాకంటే ముందుగా.

ఇక మరో దారమ్మట వెడితే చల్లని గాలినిచ్చే చెట్లూ, తమకంటూ ఆస్తీ, అంతస్థూ లేక పోయినా తిండికోసం లేచిందగ్గర్నుంచి తంటాలు పడుతూ, భగవంతుడిచ్చిన జన్మని తెల్లార్చుకోవ టానికి ప్రయత్నించే ముష్టివాళ్ళ నివాస స్థలం, ఆ పక్కనే వున్న పాడుపడిపోయిన చెరువు ఇలాంటివి కనపడతాయి.

ఆ దారితో నాకు నాలుగేళ్ళ నుంచి పరిచయం వుంది. లంచ్ అవర్లో కూడా ఆ దారిలోనే వెళ్ళి టిఫిన్ చేసి వస్తుంటాను. ఆ దారి నుంచి వచ్చేటప్పుడు, వెళ్ళేటప్పుడు అప్రయత్నంగా నా కళ్ళు ముష్టివాళ్ళ నివాసం వేపు చూస్తాయి. అక్కడ అన్ని వయసుల వాళ్ళూ, అన్ని రకాల వాళ్ళు, అంగవిహీనులూ చాలా మంది కనపడతారు. నేను వాళ్ళ నివాస స్థలం వేపు దృష్టి సారించేది వాళ్ళ బతుకులమీద రీసెర్చి చెయ్యాలనీ, వాళ్ళ బతుకులను బాగు చెయ్యమని ఏ నాయకుడితో ఘాటుగా ఉత్తరం రాద్దామని మాత్రం కాదు. ఎందుకో అప్రయత్నంగా నా కళ్ళు అటువేపు చూడడం, ఓ క్షణం జాలిపడటం నాకు అలవాటైపోయాయి.

ఓ రోజు లంచ్ అవర్లో బయటకు వెడుతూ అటువేపు చూసాను. ఓ జంట దుప్పటి చాటు చేసుకుని సృష్టికార్యాన్ని సాగిస్తోందిలా వుంది. మగ శరీరం ఆడశరీరాన్ని పూర్తిగా ఆక్రమించుకుని వేడి చల్లార్చుకోవాలని ప్రయత్నిస్తున్నట్టుంది. సరిగ్గా అదే సమయానికి గట్టిగా వీచిన గాలి వాళ్ళు అడ్డుగా కట్టుకున్న దుప్పటిని ఎగరేసుకుపోయి ఆ దృశ్యాన్ని నా కళ్ళబడేటట్టు చేసింది. ఆడ శరీరం గబుక్కున లేచి చీర సరి చేసుకుని లేచిపోయింది. ఆ వెనకే మగ శరీరం కూడా. ఇద్దరి ముఖాల్లోను అసంతృప్తి తాలూకు ఛాయలు, ఎవరైనా చూసారేమోనని సిగ్గుతో కూడిన భయం నాకు కనిపించాయి. వెంటనే నా చూపుల్ని మరల్చుకుని నడక వేగం పెంచాను. ప్రకృతిలో అతి సహజమైన మధురానుభూతిని కలిగించే కోర్కెను ఇతరుల కంటపడకుండా తీర్చుకోవటానికి వాళ్ళకి అడ్డు కూడా లేదు. ఓ నిమిషం నా మనసు మనస్ఫూర్తిగా బాధపడింది. మర్నాటికి నాకా విషయం గుర్తులేకపోయినా అలవాటుప్రకారం అటువేపు చూసాను. ఆమె నాకేసి చూసి సిగ్గుపడి తలదించుకుంది. లంచ్ అవర్లో అటువేపు చూడకుండా నడుస్తున్న నాకు ఆమె దారిలో తటస్థపడింది. నన్ను చూసి సిగ్గుతో కుచించుకుపోయింది. ఆమె నన్ను చూసి ఎందుకు సిగ్గుపడుతోందో ఆలోచించటానికి నా మట్టి బుర్రకి పది నిమిషాలు పైగా పట్టింది. ఆ సాయంత్రం ఆఫీసవగానే వెళ్ళిపోతున్న శాస్త్రితో అన్నాను "నేనూ వస్తున్నా శాస్త్రీ కల్సి వెడదాం!" అని.

"నీ దారి, నా దారీ వేరుగా బ్రదర్" అన్నాడతను.

## బాష్పకణం

గంగ పారుచోట, గాంధి పుట్టిన నాట
బారకొక్క బ్రాంది బారు వెలసె—
కల్పవృక్షమందు గంజాయి పూతరా!
బాపు కంట నిలిచె బాష్పకణము!

ఇండియాకు ఎల్లలేమిటి చెప్పుమా,
జలధులుండ మూడు కెలకులందు!
కైపులోన తేలు ద్వీపకల్పమ్మిదే!
బాపు కంట నిలిచె బాష్పకణము!

—కలువకొలను సదానంద

### అక్టోబర్ 2 గాంధీ జయంతి



బాపూజీ

నఖచిత్రం: కాళీపట్నపు కృష్ణారావు, మురపాక




